ప్రొద్దుటి నుంచి భర్త కోసం ఎదురు చూస్తున్న సావిత్రికి తిండిలేక పోవడంతో నీరసం ముంచుకు వచ్చింది. గోడకి జారగిలబడి వరండాలో నిల్చుంది. ఆమె కళ్ళు మండుతున్నాయి. అయినా ఎదురు చూస్తూనే వుంది.

సాయంత్రం ఆరుగంటల వేళ పూటుగా తాగి, తూలుతూ, తడబడే అడుగులతో ఇంట్లోకి వచ్చాడు రామారావు. ఆపూట పేకాటలో చిత్తుగా ఓడిపోయి మస్తుగా త్రాగినట్లున్నది అతని వాలకం.

"సావిత్రీ! అర్జంటుగా వందరూపాయలు కావాలి–యివ్వు" రామారావు గద్దించి అడిగాడు. అతని నోటినుండి గుప్పున వస్తున్న వాసన భరించ లేక మొహం తిప్పేసుకుంది సావిత్రి.

"ఏయ్! అర్జంటుగా కావాలి!" మళ్ళీ అడిగాడు రామారావు.

# ఆరాధనా

బద్దెపూడి సుధారాణి

"నా దగ్గర వంద కాదుగదా! ఒక్క నయా పైసా కూడా లేదు." సావిత్రి దుఃఖాన్ని దిగ మింగుతూ అరిచింది. దాంతో సావిత్రి చెంప చెళ్ళుమంది. "ఏమిటా పొగరు? ఇవ్వవేం?" రామారావు అరిచాడు. సావిత్రి జవాబు చెప్పలేదు.

"ఏం మాట్లాడటం కూడా నీకు ఇష్టంలేదా?" మళ్ళీ సావిత్రి చెంపలు పేలిపోయినాయి.

"మీరు కొట్టినా, చంపినా నాదగ్గర డబ్బు లేదు" సావిత్రి నిర్భయంగా అన్నది. సావిత్రిని స్పృహ తప్పి పడిపోయేదాక కొట్టాడు రామారావు.

రామారావు విసురుగా వెళ్ళి సావిత్రి బట్టలపెట్టె తీసి నేలమీద బోర్లించాడు. రెండు చేనేత చీరలు, వెలిసిపోయిన ఒక సిల్కు చీరతోపాటు, చిన్న పర్సు కూడా నేల మీద పడింది. ఆత్రంగా పర్సుతీసి చూశాడు. నలిగిపోయిన పదిరూపాయల నోటు, కొంత చిల్లరా వున్నాయి. అవి తీసి జేబులో వేసుకుని వెళ్ళిపోయాడు.

రామారావు వెళ్ళిన గంటకి సావిత్రికి తెలివి వచ్చింది. సావిత్రికి రామారావు కనిపించలేదు. బోర్లించిన పెట్టె, ఖాళీ పర్సు వెక్కిరిస్తూ కనిపించాయి. దోసిట్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

మరో గంటకల్లా లేచి పనులన్నీ ముగించుకొని రామారావు కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. రోజూ ఇదే తంతు ఆ ఇంట్లో.

మర్నాడు ప్రొద్దుటే టెలిగ్రాం వచ్చింది–సావిత్రి తల్లికి సీరియస్‌గా వున్నట్లు. రామారావుకు ఆ వార్త చెప్పాలని అతనువుండే చోటుకు కబురు చేసింది సావిత్రి. రామారావు స్నేహితుడొకడు చెప్పిన వార్త విని, సావిత్రి ఘోరుమంది. రామారావు తన ఆఫీసులో పనిచేసే అమ్మాయితో ఏదో ఊరు వెళ్ళిపోయాడుట! ఇల్లు అమ్మేసి, డబ్బు పట్టుకుపోయాడట. సావిత్రిని పుట్టింటికి వెళ్ళిపొమ్మని, తను తిరిగివస్తాననే ఆశ పెట్టుకో వద్దని, స్నేహితుడిచేత కబురుచేశాడు. సావిత్రికి తనొక అగాధంలోకి పడిపోతున్నట్లనిపించింది. దుఃఖాన్ని దిగమింగుకుని, సామానంతా తెలిసిన వాళ్ళింట్లో పెట్టి తల్లిని చూసేందుకు రైలు ఎక్కింది....

సావిత్రి బి. ఏ చదివింది. పెళ్ళికి ముందు–రిటైర్ అయిన తండ్రికి సాయంగా వుండేందుకు ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఉండేది.

సావిత్రి అందం ప్రతి ఒక్కరినీ ఆకర్షించేది. సావిత్రి పరిచయం కోసం ఎందరో తపించి పోయేవాళ్ళు ఆఫీసులో. అంతమందిలోనూ ఒక్క మధు మాత్రం సావిత్రిని ఆకర్షించాడు. అతను అందగాడే కాదు, తెలివి తేటలుగలవాడు కూడా. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ, చలాకిగా వుండే వాడు. అతన్ని పెళ్ళాడే ఆమె ఎంత అదృష్ట వంతురాలో అనుకునేది సావిత్రి. ఆమె దృష్టి ఎప్పుడూ అతని మీదే వుండేది. ఓసారి సావిత్రికి జ్వరం వచ్చి ఆఫీసుకు రాలేదు. వారం రోజుల తర్వాత ఆఫీసుకి వచ్చిన సావిత్రిని ముందుగా పలకరించింది మధు ఒక్కడే.

"మల్లెలా వుండేవారు సన్నజాజిలా అయి పోయారేం?" అన్నాడు నవ్వుతూ. అతను అడిగిన తీరుకి నవ్వింది సావిత్రి. ఆ చిరునవ్వు మధు హృదయాన్ని గిలిగింతలు పెట్టింది.



ఓరోజు కుండపోతగా వర్షం కురుస్తున్నది. "ఇంటికి ఎట్లా వెళ్ళటమా?" అని ఆలోచిస్తున్నది సావిత్రి.

"టాక్సీ వచ్చింది వెళదాం రండి, పొద్దుపోతే మీవాళ్ళు గాభరా పడతారేమో, మిమ్మల్ని మీ ఇంటిదగ్గర డ్రాప్‌చేసి వెళతాను" అన్నాడు మధు. అతను రెండు మూడుసార్లు అడగటంతో కాదనలేక అతనితో టాక్సీ ఎక్కింది. టాక్సీ వేగంగా పోతున్నది. వర్షం ఉధృతంగా వుంది. సావిత్రి చెక్కిలిమీద చెయ్యిచేర్చి ఆలోచిస్తూ కూర్చుంది. అది గమనించిన మధు అడిగాడు. "ఏమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు? కథకి ప్లాటా?"

"నేనేం రచయిత్రిని కాదులెండి".

"మరేమిటో ఆలోచన?"

"మీగురించే" అన్నది నవ్వుతూ.

"నాగురించా?" ఆశ్చర్యంగా అడిగాడు మధు.

"అవును. మీరు నాగురించి ప్రత్యేక శ్రద్ధ చూపుతుంటే ఎందుకా? ఏమిటా? అని ఆలోచిస్తుంటాను."

"అవును! మీరు నన్ను బాగా ఆకర్షించారు".

"అంటే మీ వుద్దేశం?"

"ఏమి అనుకోరుకదా చెబితే."

"ఉహూ! చెప్పండి."

"మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. పెళ్ళి కూడా చేసుకోవాలనుకుంటున్నాను."

"తొందరపడుతున్నారేమో?"

"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. మరి మీ అభిప్రాయం?" మధు ఉత్సాహంగా అడిగాడు.

సావిత్రి మనసంతా సంతోషంతో నిండిపోయింది. అంత అందమైనవాడు తనని పెళ్లాడతాననటం తన అదృష్టంగా భావించింది. అదే మాట మధుతో అన్నది. ఇద్దరూ ఉత్సాహంగా ఇళ్ళు చేరారు.

ఆనాటి పరిచయం వాళ్ళిద్దర్ని దగ్గర చేసింది. ఇద్దరూ కలిసి సినిమాలకి షికార్లకి వెళ్ళేవాళ్ళు.

మధు ఓనాడు సావిత్రితో అన్నాడు: "సావిత్రీ! మావాళ్ళు నా పెళ్ళికి తొందరపడుతున్నారు. మరి తమరేమంటారో?"

"నాన్నగారికి చెప్పాలిగా మధూ!"

"మీ నాన్నగారు ఇష్టపడకపోతే?" అనుమానంగా అడిగాడు మధు.

"పిచ్చి మధూ! నీలాంటివాడు అల్లుడవుతానంటే ఏ తండ్రి కాదంటాడు?"

"అయితే మీ నాన్నగార్ని అడిగి చెప్పు!" మధు ఉత్సాహంగా ఉన్నాడు.

"అబ్బో అబ్బాయిగార్కి పెళ్ళంటే మహా తొందరగా వుందే!" సావిత్రి నవ్వుతూ అన్నది. మధు కూడా నవ్వేశాడు.

ఓ వారం రోజుల తరువాత సావిత్రి బజారు నుండి వస్తుండగా సావిత్రి చిన్ననాటి స్నేహితురాలు జానకి కలిసింది.

"జానకీ ఎప్పుడు వచ్చావు?" సావిత్రి ఆమె చేయి పట్టుకుని ఆప్యాయంగా అడిగింది.

"వచ్చి రెండు రోజులు అయింది. మావారితో కలిసి వచ్చాను. వచ్చిందగ్గర నుంచీ నిన్ను చూడాలనే తపన. ఈ రోజు మీ ఇంటికే బయల్దేరాను. వెతకబోయిన తీగె కాలికి తగిలినట్లు అగుపడ్డావు!" అన్నది నవ్వుతూ ఆమె. సావిత్రి జానకిని తన ఇంటికి తీసుకుపోయింది. మాటల మధ్యలో జానకి అడిగింది. "సావిత్రీ! నీకు పెళ్ళి అయిందనుకున్నానే!"

"నా పెళ్ళి అంత తొందరగా జరగదులే జానకీ! నా కోరికలు వింటే నవ్వుతావు. పెద్ద చదువులు చదివినవాడు, మంచి అందగాడ్ని చేసుకోవాలనుకుంటున్నాను. అమ్మా, నాన్న, స్థితిమంతుడు కావాలంటున్నారు. ఇవన్నీ ఎలా వున్నా, వేలకి వేలు కట్నాలు యివ్వాలి. ఆస్తిపాస్తులు లేనివాళ్ళం. నాన్న రిటైర్ అయ్యారు. నీవే చెప్పు. వేలకి వేలు కట్నాలు ఎలా తెమ్మంటావు?"

"నిజమేలే సావిత్రీ, ఆ టైము వస్తే అదే అవుతుంది!" అన్నది జానకి. మధు సంగతి చెప్పాలని మనసు తొందరపడుతున్నా, ఎందుకో చెప్పలేకపోయింది సావిత్రి.

"సావిత్రీ! మా మరది రామారావు బి. ఏ. పాసైనాడు. బోలెడు ఆస్తి వుంది. బిజినెస్ చేస్తున్నాడు. మనిషి అందగాడే, అతనికి కట్నం తీసుకునే ఉద్దేశం లేదు. నిన్ను చూస్తే పెళ్ళాడటానికి తప్పక ఒప్పుకుంటాడనే నా ఉద్దేశం. అతను మొన్ననే వచ్చాడు. మీ ఇంటికి తీసుకువస్తాను చూడు."

"నాదేముంది జానకీ! అమ్మా నాన్న ఇష్టపడితే సరే" అన్నది.

జానకి తెచ్చిన సంబంధం సావిత్రి తల్లితండ్రులకి ఎంతో నచ్చింది.

ఓనాడు జానకి తన భర్తనీ, వరుడు రామారావునీ వెంటబెట్టుకు వచ్చింది. పరిచయాలు అయినాయి. కాఫీ ఫలహారాలు పూర్తి అయినాయి. రామారావు దృష్టి అంతా సావిత్రి మీదే వుంది. రామారావు క్రొత్త అని లేకుండా బాగా మాట్లాడాడు. ఆ రోజంతా వాళ్ళతో సందడిగా గడిచిపోయింది సావిత్రికి. ఆ రాత్రి అంతా నిద్రను దూరం చేసుకొని ఆలోచించింది సావిత్రి.

మధు ఒక గుమాస్తా. అతని జీతం మూడొందలు. అందగాడైనా, ఆస్తిపాస్తులు లేవు. ఇక రామారావుకి కావల్సినంత ఆస్తి వుంది. మధుని వివాహమాడితే, తను ఉద్యోగం చేయక తప్పదు. అదే రామారావు అయితే, తనకి ఉద్యోగం చేయాల్సిన కర్మ వుండదు. రామారావుని పెళ్లాడితే జీవితం వడ్డించిన విస్తరిలా వుంటుంది. మధుని పెళ్ళాడితే పొదుపు ఉద్యమం ప్రారంభించి, కష్టాలు కన్నీళ్ళు కొని తెచ్చుకోవాలి. పిల్లలు పుడితే, చాలీచాలని జీతాలతో, అన్నీ అవస్థలే. సావిత్రి ఆ రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. తన జీవితంలో కష్టపడకుండా సుఖపడాలంటే రామారావుని పెళ్ళాడాల్సిందే – అనుకుంది.

మర్నాడు సావిత్రి ఆఫీసుకి వెళుతుంటే దోవలోనే ఎదురైనాడు మధు. అతన్ని చూసి కూడా పలకరించలేదు సావిత్రి.

"ఏం సావిత్రీ, అట్లావున్నావు? ఒంట్లో బాగుండలేదా? లేక మీవాళ్ళు మన పెళ్ళి కాదన్నారా?" మధు ఆదుర్దాగా అడిగాడు.

"అవును. 'ఆస్తిపాస్తులు లేకపోయినా, అతనిది పెద్ద ఉద్యోగం కూడా కాదే, అతన్ని కట్టుకొని నీవేం సుఖపడతావు? పెళ్ళయినా ఉద్యోగం చేస్తూ బ్రతకాల్సిందే. నీకి జీవితంలో విశ్రాంతి వుండదు' అన్నారు" అన్నది–మధు మొహంలో మార్పులను గమనిస్తూ.

మధు చిరునవ్వు నవ్వాడు. అతను అలా నవ్వటం సావిత్రికి వింతగా వుంది.

"సావిత్రీ, ప్రతి ఆడపిల్ల తల్లితండ్రులు

అలా అనుకోవటం సహజం. కానీ, నీకూ నాకూ ఇష్టమైనప్పుడు, పెద్దవాళ్ళ అభిప్రాయాలు కాదు కావల్సింది—పెళ్ళాడటానికి పర్మిషన్ ఒక్కటే." అన్నాడు నవ్వుతూ.

తను అన్న మాటలకి బాధపడి ఏమేమో అంటాడని ఊహించుకున్న సావిత్రి అతను అలా చెప్పటంతో ఆశ్చర్యపోయింది. మధు ఏవేవో కబుర్లు చెబుతూనే వున్నాడు—ఇద్దరూ ఆఫీసు చేరేదాక. సావిత్రి రామారావుని గురించి ఆలోచిస్తున్నది. సావిత్రి ప్రవర్తన మధుకి ఆశ్చర్యం కలిగించింది. ఆమె మౌనానికి అర్థమేమిటో తెలీక బాధపడ్డాడు. ఎప్పుడూ నవ్విస్తూ, కవ్విస్తుండే సావిత్రి అట్లా వుండటం మధుకి ఎలాగో వుంది. సావిత్రి ఆరోజంతా ముభావంగానే వుంది. మధుకి ఆమె ప్రవర్తన—బాధ కలిగించింది.

ఉన్నట్టుండి ఓనాడు మధుకి వాళ్ళ ఊరి నుండి టెలిగ్రాం వచ్చింది – అతని తల్లికి జబ్బుగా వుందని. మధు వాళ్ళ ఊరు వెళ్ళి తల్లికి ఆరోగ్యం కుదుటపడేవరకు వుండి తిరిగి వచ్చాడు.

అతను ఆఫీసుకి రాగానే, తన టేబిల్ మీద ఇన్విటేషన్ చూశాడు. 'ఎవరిదా?' అనుకుంటూ తీసి చూశాడు. నెత్తి మీద పిడుగు పడ్డట్టు అదిరిపోయాడు. అది సావిత్రి శుభలేఖ! "చి॥ సావిత్రిని రామారావుకిచ్చి" ఆ పైన చదవలేకపోయాడు. అతని హృదయం అంతా బాధతో నిండిపోయింది. 'సావిత్రి మౌనానికి కారణం ఇదా?' అనుకున్నాడు.

'తల్లితండ్రుల పట్టుదలవల్ల ఇట్లా జరిగి వుంటుంది. సావిత్రి ఎలా సమ్మతించింది ఈ పెళ్ళికి? తనతో గడిపిన మధుర క్షణాలు, తనతో చెప్పిన తీయని కబుర్లు ఏమైనాయి?' మధుకి ఆలోచిస్తున్నకొద్దీ తల తిరిగిపోయింది. సావిత్రి కోసం ఆఫీసంతా కలియచూశాడు. ఆమె లేకపోవటంతో బరువుగా నిట్టూర్చాడు. మనసంతా ఆదోళా అయిపోగా, ఆఫీసుకి సెలవు పెట్టేసి రూము చేరుకున్నాడు. అతనికి తెలీకుండానే కన్నీళ్ళు వచ్చినాయి.

సావిత్రి ఎందుకు ఇలా చేసింది? సావిత్రి ఇష్టం లేకుండానే ఆమె పెళ్ళి జరుగుతున్నదా? తను తన తల్లిదండ్రులని ఒప్పించాడు. తన తండ్రి వచ్చి సావిత్రి తల్లిదండ్రులను కలుసుకుని మాట్లాడతానన్నాడు. తను సావిత్రికి సంతోషంగా ఈ వార్త చెప్పాలని వచ్చాడు. కానీ తన సంతోషం ఎగిరి పోయింది. ఆశలు కూలిపోయాయి. తన ప్రియురాలు తనని మోసగించిందని ఏ మొహం పెట్టుకుని చెబుతాడు? ఎవరికి చెప్పుకున్నా తీరని బాధ తనది. సావిత్రిని కలుసుకుని, ఇట్లా ఎందుకు జరిగిందో, అడగాలనిపించింది మధుకి. పెళ్ళి ఇంకా వారం రోజులు వుంది. సావిత్రికి ఇది బలవంతపు పెళ్ళి అయితే తను ఏదో రకంగా, ఈ పెళ్ళి తప్పించగలడు — అనుకున్నాడు మధు. సావిత్రితో మాట్లాడాలని ఎంత ప్రయత్నించినా, వీలుకాలేదు. ఆమె ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినట్లు తెలిసి బాధపడ్డాడు. ఆమెను చూడాలని, కలుసుకోవాలని ఎంత ప్రయత్నించినా, కలుసుకోలేక పోయాడు.

ఓనాడు సావిత్రి గుడికి వెళుతూ ఎదురైంది మధుకి. "ఏం సావిత్రీ! బొత్తిగా కనిపించటం మానేశావు?" మధు ముందుగా పలకరించాడు. జవాబుగా చిరునవ్వు నవ్వింది సావిత్రి.

"సావిత్రీ, నీతో కొంచెంసేపు మాట్లాడాలి. అలా పార్కుదాకా వెళదాం, వస్తావా?" మధు అడిగాడు.

"సారీ! నేను రాలేను. ఎవరైనా చూస్తే బావుండదు. నువ్వు మాత్రం తప్పకుండా, నా పెళ్ళికి రావాలి మధూ! నీకు చెప్పాలనుకుంటే వీలు కాలేదు" అన్నది సావిత్రి.

"సావిత్రీ! నేనొకటి అడుగుతాను. నిజం చెబుతావా?"

"ఏమిటి మధూ! ఆ చెప్పేదేదో త్వరగా చెప్పు. నేను తొందరగా వెళ్ళిపోవాలి" అన్నది సావిత్రి.

"సావిత్రీ! ఈ పెళ్ళి నీ ఇష్టం మీదనే జరుగుతున్నదా?" దీనంగా అడిగాడు మధు.


"అవును" అన్నది సావిత్రి.

మధుకి రోషావేశాలు ముంచుకు వచ్చినాయి. నిలకడలేని ఆమె బుద్ధిని అసహ్యించుకున్నాడు అతను. "నాలో అన్ని ఆశలు రేపి, నన్ను చివరికి పిచ్చివాడి క్రింద జమకట్టి, మరొకడ్ని కట్టుకుంటున్నదా సావిత్రి! అలాంటప్పుడు నాతో స్నేహం ఎలా చేసింది? అన్ని తీయని కబుర్లు

ఇటీవల పన్నెండేళ్ళ పసిపిల్ల ఒకామె- ఒక మగపిల్లవాణ్ణి ప్రసవించింది. ఇంగ్లండులోని కెంట్‌కు చెందిన వెస్ట్ హిల్ హాస్పిటలులో ఆ తల్లీ, పిల్లవాడు ఆరోగ్యం పుంజుకుంటున్నారు.

మామూలుగా 14 ఏళ్ళ ప్రాయానికి ముందు ఆడపిల్లలు గర్భం ధరించడం అన్నది అపురూపమైన విషయం అంటారు వైద్యశాస్త్రజ్ఞులు.

అందువల్ల పన్నెండేళ్ళ పసిపిల్ల – పాపాయిని ప్రసవించడం అన్నది చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఈ ప్రసవ కారణాల గురించి వైద్యశాస్త్రజ్ఞులూ, పోలీసులూ – విచారణ జరుపుతున్నారు. ఆ అమ్మాయి భవిష్యత్తు దృష్ట్యా ఆమె పేరును మాత్రం బయటికి పొక్కనివ్వవద్దని ఆమె తల్లిదండ్రులు కోరారట!



ఎలా చెప్పింది ? 'పెళ్ళంటూ చేసుకుంటే నిన్ను తప్ప మరొకర్ని చేసుకుంటానా మధూ! మరొకర్ని చేసుకోవాల్సిన పరిస్థితే వస్తే పెళ్ళంటూ చేసుకోను మధూ' అనేది. అలాంటి సావిత్రిలో ఇంత మార్పా ?''—మధు మనసంతా బాధతో మెలికలు తిరిగిపోగా, అక్కడ ఓ క్షణం కూడా నిలబడలేక రూమ్ చేరుకున్నాడు.

సావిత్రి పెళ్ళి వైభవంగా జరిగింది. మధు పెళ్ళికి వెళ్ళలేదు. సావిత్రి ఆలోచనలన్నీ రామారావు చుట్టూ తిరుగుతుండటం వల్ల మధు రానందుకు బాధపడలేదు; అతన్ని తలుచుకోనూ లేదు.

మధు దిగులుతో మంచమెక్కాడు. రెండు నెలలు జబ్బుపడి లేచాడు. అతనికి కోరికలు, ఆశయాలు ఏమీ లేవు ఇప్పుడు. సావిత్రి అలా ఎందుకు మారిపోయిందో – అన్న బాధ ఒక్కటే అతనికి మిగిలిపోయింది.

*

నాలుగేళ్ళ తరువాత ఓనాడు మధుకి హఠాత్తుగా సావిత్రి కనిపించింది. ఆమె రైల్వే స్టేషన్‌లో ఒక సిమెంటు బెంచీ మీద కూచుని వుంది. పక్కన సామాను కూడా ఏమీలేదు. సావిత్రిని చూసి ఆశ్చర్యపోయాడు మధు. ఆమె వదలిపోయిన తోటకూర కాడలా వుంది. మొహంలో మునుపటి కళాకాంతులులేవు. లోతుకుపోయిన కళ్ళు, పీక్కుపోయిన దవడలతో అదోలా వుంది. బాగా నల్లబడిపోయింది. ఆస్తి గలవాడి భార్య సాదా ముతకనేత చీర కట్టుకుని వుంది. మెళ్ళో పసుపుతాడు మించి ఒక్క నగ కూడా లేదు! ఇది వింతగా అనిపించింది మధుకి.

"సావిత్రీ! నేనెవర్నో గుర్తున్నానా ?" తనే ముందుగా పలకరించాడు.

"ఊఁ! బావున్నావా మధూ" ఆమె హీన స్వరంతో అడిగింది. జబాబుగా నవ్వలేక నవ్వాడు మధు.

"మీ శ్రీమతి ఎక్కడా? పిల్లలు ఎంతమంది! ఉద్యోగం ఎలా వుంది ?" అవిగాక ఇంకేమైనా అడిగి వుంటే బావుండే దనుకున్నాడు మధు,

"మీవారు రాలేదా ? పిల్లలు ఏరి ? ఒంటరిగా వచ్చావేమిటి ?" ఆమె ప్రశ్నకి జవాబు ఇవ్వకుండానే అడిగాడు మధు.

"అమ్మకి సీరియస్‌గా వుందని టెలిగ్రాం వస్తే వెళ్ళాను. అమ్మ పోయింది. తిరిగి వెళుతున్నాను."

"ఓ! పాపం! అఁ పిల్లలు ఎంతమంది ? తీసుకురాలేదేం?" మధు ప్రశ్నలకు సమాధానంగా సావిత్రి చెంపల మీద కన్నీళ్ళు జారాయి.

"సావిత్రీ! ఏడుస్తున్నావా ?"

"ఇంకేం చెయ్యను ? నా బ్రతుక్కి ఏడుపు కాక నవ్వెలా వస్తుంది మధూ!" ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"ఆస్తి, అంతస్తుగల భర్త వున్నాడుగా, నీకేం లోటు ?"

"మధూ! నన్ను హేళనచేస్తున్నావా ?"

"నాకన్నా అన్నింటా అధికురాలివి. నిన్ను హేళన చేసేటంతవాడినా ?"

"మధూ, చచ్చిన పాముని ఇంకా చంపటం ఎందుకు ?" సావిత్రి ఏడుస్తున్నది.

"సావిత్రీ! ఏడుపెందుకు ? ఇష్టపడి చేసుకున్న పెళ్ళేకదా ?"

"కావచ్చు! నీకు చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం అనుభవిస్తున్నాను...."

"అంటే ?"

ఆశ్చర్యంగా అడిగాడు మధు.

"ఏం చెప్పమంటావు ? ఎలా చెప్పమంటావు మధూ" సావిత్రి దోసిట్లో మొహం దాచుకుంది.

"సావిత్రీ! బాధ పడకుండా చెప్పు"

"ఆయనకి అన్ని వ్యసనాలూ వున్నాయి మధూ! పెళ్ళి అయిన తరువాత ఆరు నెలలు మాత్రమే నాతో సరిగా వున్నారు. తరువాత నన్ను బొత్తిగా పట్టించుకునేవారు కాదు. త్రాగుడుకీ పేకాటకి అంకితం అయ్యారు. చివరికి నా మెళ్ళో మంగళసూత్రం అమ్మేదాకా ఆడారు! అంతా పోయింది. ఆస్తి పాస్తులు శాశ్వతం కావని తెలుసుకోలేకపోయాను మధూ! ఆయనకి ఏదైనా మంచి చెప్పబోతే కొట్టేవారు. దయా దాక్షిణ్యాలు లేని మనిషి ఆయన. దేవుడిలాంటి నిన్ను కాదని అత్యాశకి పోయి ఇంత నాశనమైపోయాను. నా జీవితానికి ఇక సుఖమూ, శాంతీ రెండూ లేవు మధూ! ఆయనకి విలాసాలు ఎక్కువైనాయి. ఇంటికే రావటం మానేశారు. బిజినెస్ కూడా దెబ్బ తిన్నది. నన్ను డబ్బు తెమ్మని పీడించటం, ఇవ్వకపోతే, చావగొట్టటం ప్రారంభమైంది. ఇల్లు గడవటం కష్టమైంది. ఉద్యోగంలో చేరమన్నారు-చేరాను. నెల జీతం తేగానే ఆయన దోసిట్లో పోయాల్సిందే!

"ఓ రోజు అర్జంటుగా వందరూపాయలు కావాలని అడిగారు-లేవన్నాను. బాగా కొట్టారు. 'తెల్లవారేలోగా తెచ్చి యివ్వకపోతే, ఏం చేస్తానో చూడు' అన్నారు. ఏం చేస్తారోనని భయమేసి మా ఆఫీసులో పని చేసే గోపాలంగారిని అడిగి ఓ వందరూపాయలు తెచ్చి యిచ్చాను.

"'నీ వేదో అనుకున్నాను – పతివ్రత వేషాలు వేస్తుంటే. ఫరవాలేదే, ఎవర్నో పట్టినట్లున్నావు. అడిగిన వెంటనే అందించావు డబ్బు' అన్నారు వెకిలిగా నవ్వుతూ. ఆ రోజు ఎంతగా ఏడిచానో భగవంతుడికే తెలియాలి. చచ్చిపోవాలని చాలా సార్లు ప్రయత్నించాను. పక్కింటి ఆమె నన్నెప్పుడూ ఓ కంట కనిపెట్టి వుండి, నా ప్రయత్నాలను విఫలం చేసేది. ఓనాడు నా పెట్టెలో డబ్బు కోసం వెతుకుతుండగా ఆయనకి నా డైరీ కనిపించింది. అది చదివి ఉగ్రుడైపోయారు.

"'ఎవరీ మధు? ఏమిటీ కథ?' అని. నా ఒళ్ళు హూనమయ్యేలా కొట్టారు. అనుమానంతో ఏం చెప్పినా వినిపించుకునే స్థితిలో లేరు ఆయన. 'ఆ మధుగాడినే కట్టుకోలేకపోయావా ? ఈ భాగోతం ఎందుకు మధ్యలో ?' అన్నారు. ఆ రోషంతో ఇల్లు అమ్మేసి, తన ఆఫీసులో పనిచేసే అమ్మాయితో వెళ్ళిపోయారు. ఇల్లు అమ్మిన డబ్బులో పైసా కూడా నాకు ఇవ్వలేదు. చావలేక బ్రతుకుతూ, ఒంటరిదాన్నయిపోయాను. ఎంత తొందరగా నా జీవితం ముగుస్తుందా ? అని ఎదురు చూస్తున్నాను." ఆమె చెప్పటం ఆపి ఏడుస్తోంది. మధుకి కళ్ళనిండా నీళ్ళు నిండాయి.

"మధూ! నీ గురించి నాకేమీ చెప్పలేదు!"

"నా గురించి చెప్పడానికి ఏమీలేదు సావిత్రీ! బ్రహ్మచారిని. రోగం వచ్చి మంచం ఎక్కితే, గుక్కెడు మంచి నీళ్ళు గొంతులో పోసేవాళ్ళు కూడా లేరు. నీ జ్ఞాపకాలతో కాలం గడుస్తున్నది." చెప్పటం ఆపి బరువుగా నిట్టూర్చాడు మధు.

"మధూ! అదిగో ట్రైన్ వచ్చేస్తూంది. ఇక వెళతాను. నీకు నేను చేసిన అన్యాయానికి క్షమించు మధూ! భగవంతుడు నీకు ఎప్పుడూ మేలు చేయాలని ప్రార్థిస్తుంటాను. ఇక సెలవు మధూ!" అంటూ సావిత్రి రైలెక్కింది. ఆ రైలు కనుమరుగయే వరకు చూసి బాధగా నిట్టూర్చాడు మధు. □